## గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.2 లక్షలు విరాళం



కాణిపాకం, మే 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు భక్తులు సోమవారం రెండు లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు నెల్లూరుకు చెందిన చలపతిరావు, వాణి దంపతులు ఈపథకానికి రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన స్పెక్టర్ రవి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.




## దిగువఘాట్‌లో మళ్ళీ చిరుత



తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి: సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఓ చిరుతపులి ఏకంగా దిగువఘాట్‌లో (మొదటి)వినాయకుడిగుడి వద్ద రక్షణగోడపై కూర్చుని ఉండటం, వాహనాల రాకతో వెలుతురుఫోకస్‌కు గోడపై వెళ్ళడం జరిగింది. మొదటిఘాట్‌రోడ్డు దాటడాన్ని వాహనదారులు గమనించారు. వెంటనే భయంతో విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. చిరుతపులి సంచారంతో భక్తులు భయపడుతున్నారు.

# కొండకు "కంచె"!

## రెండోఘాట్‌లో బండరాళ్ళు జారకుండా ఉక్కువలతో పటిష్టం





ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: కొండపైకి చేరుకునే రెండోఘాట్‌రోడ్డుపై బండరాళ్ళు జారిపడకుండా ఉండేందుకు బలమైన ఉక్కువలతో కంచె వేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో బలమైన వర్షాలు కురిసినా,వరదలు వచ్చినా కొండల్లోంచి మట్టి,బండరాళ్ళు జారడానికి అవకాశం లేకుండా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు గట్టి చర్యలు చేపడుతున్నారు. గత మూడునాలుగునెలలుగా తిరుపతి నుండి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో రక్షణగోడలు మరమ్మతులు చేయడం, బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని తెలిసిన చోట్ల ఐఐటి నిపుణుల సూచనలతో బలమైన ఇనుపకంచెలా వేసి పూర్తిగా ఆ ప్రాంతాన్ని కప్పేస్తున్నారు. వర్షాలకు బండరాళ్ళు జారినా ఈ వలలోపలే చిక్కుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత కొంతకాలం క్రిందట వరకు ఎడతెరపి లేకుండా వరుసగా రెండుమూడురోజులు జోరువానొస్తే కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందనే భయం అటు టిటిడి అధికారుల్లో ఇటు భక్తుల్లో నెలకొంది. గత ఏడాది అక్టోబర్‌నెలలో, ఈ ఏడాది జనవరిలో కురిసిన భారీ వర్షాలకు తిరుమలకు వచ్చే రెండో ఘాట్‌లో భారీగా బండరాళ్ళు జారిపడిన విషయం విదితమే. దీనిపై కొంత అప్రమత్తంగా వ్యవహరించిన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఇంజనీరింగ్ అధికారులు. అటవీఅధికారులు ఎప్పటికప్పుడు జారిపడిన మట్టి, బండరాళ్ళను తొలగించారు. తిరుమలకు చేరుకునే రెండోఘాట్ ప్రమాదకరమని, ఈ మార్గంలో కొన్నిచోట్ల మట్టిజారిపడి బండరాళ్ళు పడేప్రమాదం లేకపోలేదని దశాబ్దకాలంక్రిందటే ఐఐటి నిపుణులు, ఇంజనీరింగ్ నిపుణులు హెచ్చరించారు. రెండోఘాట్‌లో దాదాపు కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని గుర్తించిన ప్రాంతాల్లో పనులు మొదలుపెట్టారు. ఈ ఇనుపకంచే ఏర్పాటుపనులు జరుగుతూనే ఉన్నాయి.

### భక్తుల భద్రతకే ప్రధాన దృష్టి!

*ప్రస్తుత పరిస్థితుల్లో ఘాట్‌లో భక్తుల భద్రతపై మరింత దృష్టి సారించింది.తిరుమలకు రెండవ ఘాట్‌రోడ్డు 18 కిలోమీటర్లు అటవీప్రాంతంలోనే ఉంది. ఇందులో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో చాలావరకు ప్రమాదకర మలుపులు, పూర్తిగా కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు గుర్తించారు. 2014వ సంవత్సరంలో, ఆ తరువాత 2021 నవంబర్-డిసెంబర్ నెలల్లో భారీ వరదలు రావడంతో వరదనీటి ఉధృతికి తిరుమలకొండలపై నుంచి వరదనీరు ప్రవాహానికి మట్టికొట్టుకువచ్చి రెండోఘాట్ పూర్తిగా దెబ్బతింది. అలాగే పెద్దపెద్ద కొండచరియలు విరిగిపడి రక్షణగోడలు ధ్వంసమయ్యాయి. గతంలోనే పై ఘాట్‌లో ప్రయాణం ప్రమాదకరమని చెన్నై ఐఐటి నిపుణులతోబాటు జెఎన్‌టియు ,కేరళ ఇంజనీరింగ్ బృందం పలు దఫాలుగా ఘాట్‌రోడ్లను పరిశీలించింది. మళ్ళీ ఇప్పుడు శాశ్వత విధానంలో రెండోఘాట్‌లో బండరాళ్ళు విరిగిపడకుండా కొండల్లో భారీ చెట్లను, బండరాళ్ళను తొలగించి దానిపై సిమెంట్‌కాంక్రీట్ వేస్తున్నారు. దానిపై బలమైన పెద్దపెద్ద ఇనుపరాడ్లను ఉంచి రెండు దశల్లో ఇనుపకంచె వేస్తుండటంతో బండరాళ్ళు రోడ్డుపై పడడానికి వీల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఘాట్‌రోడ్లపై ప్రయాణానికి అడ్డంకులు కలగకుండా చూసేందుకు ఉపక్రమించింది.భవిష్యత్తులో తుఫాన్‌లు, వరదలు వచ్చినా రెండోఘాట్‌రోడ్డుపై ప్రయాణం సురక్షితమనే విశ్వాసం కలిగించేలా పనులు జరుగుతున్నాయి.*

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన సిఎం



శాంతిపురం, మే 26 ప్రభాతవార్త మూడు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం శివపురం వద్ద ఉన్న తమ నివాస ం వద్ద ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు వింటూ వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుకు ఆదేశించారు. అనంతరం 10.50గంటలకు ద్రవిడ వర్సిటీలోని హెలిప్యాడ్‌కు రోడ్డుమార్గంలో బయలుదేరారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, స్థానిక నేతలు విశ్వ నాథ నాయుడు, ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, బాలు, రమేష్,జయరాంరెడ్డి,నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, మే 26 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వారి సమస్యలను కలెక్టర్‌తో పాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డెప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్‌మాండ్, సుధారాణిలకు అందజేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 268 అర్జీలు అందాయి. అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

26 కలెక్టరేట్ 01- అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకుంటున్న కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 266 సమస్యలు



చిత్తూరు, మే 26 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం జిల్లా నలుమూలల నుండి సమస్యలపై 266 అర్జీలు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా సమస్యలపై 204 అర్జీలు అందాయి. అలాగే పోలీసు శాఖ 15, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 18, విద్యుత్ శాఖ 7, పంచాయతీరాజ్ 4, విద్యాశాఖకు సంబంధించి 2 సమస్యలు అందాయి.

### మిసీల్స్, రూబెల్లాలను

## తరిమికొట్టడమే లక్ష్యం

### - వాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి పిలుపు




చిత్తూరు రూరల్, మే 26 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో మిసీల్స్, రూబెల్లా వ్యాధులను తరిమికొట్టడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల నిర్వర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పిలుపునిచ్చారు. మిసీల్స్, రూబెల్లా వ్యాధులను అంతం చేయడానికి ఈ నెలాఖరు వరకు మొదటి విడత స్పెషల్ డ్రైవ్ వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంను ద్విగ్విజయంగా పూర్తి చేయాలని ఆమె కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావుతో కలిసి సోమవారం మిసీల్స్, రూబెల్లాను కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 2026 సంవత్సరం నాటికి మన దేశం నుండి మీసీల్స్, రూబెల్లా వ్యాధులను పూర్తిగా తరిమికొట్టాలని భారత ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మే, జూన్, జులై నెలల్లో స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మొదటి విడత స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంను సోమవారం నుండి మే 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి కావడంతో లెఫ్ట్‌ఔట్స్, డ్రాప్ అవుట్స్, వాక్సిన్‌ను తిరస్కరించిన వారిని గుర్తించి వారి జాబితాను చేసుకోవడం జరిగిందన్నారు. ఎక్కడైనా వాక్సిన్ వేసుకోకుండా ఐదు సంవత్సరాలలోపు పిల్లలు వుంటే గుర్తించి ఈ కార్యక్రమంలో వారికి పక్కాగా వాక్సినేషన్ ఇవ్వాలన్నారు. అలాగే ఎంఆర్ మొదటి డోస్ రెండవ డోస్ వాక్సిన్ వేయించుకున్న వారిని విచారించి వాక్సిన్ వేయాలన్నారు.

## కాకాణి అరెస్టు ప్రభుత్వ కక్ష సాధింపే

### నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



వెంకటగిరి, మే 26, ప్రభాతవార్త మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కక్ష సాధింపు చర్యలో భాగంగా తెలుగుదేశం ప్రభుత్వం అరెస్టు చేసి రిమాండ్ పంపించాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోనే నేదురుమల్లి నివాస గృహంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని పతనం చేసేందుకు కుట్ర పడుతున్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నట్లు తెలిపారు. టిడిపి వారు పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని తెలిపారు. గోవర్ధన్ రెడ్డి పై అక్రమ మైనింగ్ కేస్‌తో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా పెట్టారని తెలిపారు. కాకాని గోవర్ధన్ రెడ్డి ఈ కేసులో నాలుగో నిందితుడుగా ఉండగా మొదటి నిందితుడు ఒక బెయిల్ ఇచ్చారని చెప్పారు. దీన్ని బట్టి తెలుగుదేశం వారు వైసిపి వారిని ఎంత కక్ష సాధింపు చర్య చేస్తున్నారు అర్థమవుతుందని చెప్పారు. ప్రజలు అన్ని చూస్తున్నారని తగు గుణపాఠం చెబుతారని తెలిపారు. కాకాని గోవర్ధన్ రెడ్డికి అందరం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## రాష్ట్రంలోని అన్ని డిపోలకు ఎలక్ట్రిక్ బస్సులు : ఆర్టీసీ ఎండీ



పుత్తూరు రూరల్, మే 26 ప్రభాతవార్త: రాష్ట్రంలోని అన్ని డిపోలకు దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు అందజేయనున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. పుత్తూరు ఆర్టీసీ డిపోను ఆయన సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్క నాటి నీళ్ల పోశారు. అనంతరం డిపోలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిపోలో కండక్టర్లతో మాట్లాడారు. వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల వల్ల డ్రైవర్లు ఎలాంటిఇబ్బంది ఉండదని, డ్రైవర్లు అపోహలు వీడాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులకు మీరే డ్రైవర్లుగాఉంటారన్నారు. అయితే దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు మాత్రం డీజల్ సర్వసులు ఉంటాయన్నారు. భవిష్యత్‌లో తిరుమలకు పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులు నడిపేయోచన ఉందన్నారు. డిపోలో సైతం సీఎస్‌జీ, ఎలక్ట్రిక్ బస్సులే అధికంగా నడపనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి పదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. ప్రతి మూడో సోమవారం ప్రజలతో మమేకం కావాలన్నారు. తద్వారా ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించే విధంగా వారితో మాట్లాడి అందిస్తున్న సేవల గురించి వారికి వివరించాలన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే బస్టాండ్‌ల్లో పారిశుధ్యం, సమస్యలకు సంబంధించి క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. దీనికి తోడు ఆర్టీసీ సంబంధించి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో అందరూ బాధ్యగా పని చేసి సంస్థ ప్రతిష్టను పెంచాలన్నారు. ప్రయాణికుల మెరుగైన సేవలు అందించడంతో పాటు వారితో మంచిగా నడుచుకోవాలని తద్వారా ఓఆర్ పెంచాలన్నారు. తద్వారా ఆర్టీసీ ఆదాయాన్ని పెంచాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం చూపే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఈడీ ఆపరేషన్స్ అప్పలరాజు, ఆర్టీసీ ఈడీఈ చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, డిపో మేనేజర్ ప్రశాంతి, ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### వెరిటాస్ "కాలుష్య శరాఘాతం"

## చుట్టుగుంట విలవిల

### పరిసరాల పరిశుభ్రతకు సైనిక్ స్కూల్ తిలోదకాలు రోగాలబారిన సి.రామాపురం గ్రామస్థులు





రామచంద్రాపురం, మే 26 ప్రభాతవార్త: వెరిటాస్ సైనిక్ స్కూల్ కాలుష్య శరాఘాతానికి చుట్టుగుంట విలవిలలాడుతున్నది. సి.రామాపురం సమీపంలో నిర్వహిస్తున్న వెరిటాస్ సైనిక్ స్కూల్ యాజమాన్యం తమ పాఠశాలలోని వ్యర్థాలను చుట్టు గుంటకు మళ్ళించడంతో పవిత్రమైన చుట్టు గుంట కాస్త మురికిగుంట మారిపోయింది. రామాపురం గ్రామ స్థులు చుట్టుగుంట కట్టపై కొలువుదీరిన అక్కదేవతలను తమ ఇలవేల్పులుగా నిత్యం పూజించు కుంటున్నారు. వెరిటాస్ అంటే సత్యం లేదా నిజం అని అర్థం, అదేవిధంగా సైనిక్ అంటే క్రమశిక్షణ, పాఠశాల అంటే జ్ఞానాన్ని సముపార్జించుకునే ఆధునిక దేవాలయం. వెరిటాస్ తన నిర్వచనాలకు, అర్థం పరమార్థాలకు శాశ్వత తిలోధకాలనిస్తూ వెరిటాస్ యాజమాన్యం తమ పాఠశాల పరిసరాలను అపవిత్రం చేస్తున్న విచిత్రం చుట్టుగుంట పరిశీలిస్తే అవగతం కాగలదు. వెరిటాస్ నుండి మళ్ళించిన మురుగునీటి కారణంగా చుట్టుగుంట దోమలమయమై గ్రామస్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ రోగాలబారిన పడవేస్తున్నది. రామాపురం గ్రామస్థులు డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలతో మంచంపడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెరిటాస్ దుశ్చర్యలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చుట్టుగుంట దుర్గంధంపై పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరి కొంత కాలం ఇదేరీతిన చుట్టు గుంట కాలుష్య కోరల్లో కొనసాగితే ఈ ప్రాంతంలోని భూగర్భజలాలు సైతం విషపూరితమయ్యే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ నుండి విడుదలవుతున్న వ్యర్థాల నుండి గ్రామస్థులను కాపాడటంలో జిల్లా కలెక్టర్ స్పందించి ఆరోగ్య, వైద్య, రక్షిత మంచినీటి సరఫరా విభాగాలను అప్రమత్తం చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### శివం టు శివం రోడ్డు నిర్మాణంతో

## రూపురేఖలు మారనున్న శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు మళ్ళీ మళ్ళీ వచ్చే రీతిలో తీర్చిదిద్దటానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులను పరుగులు తీయిస్తున్నారు. ఇందులో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు ఆలయ రూపు రేఖలతో పాటు పర్యాటకానికి ప్రధాన్యత ఇస్తూ శివం టు శివం రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు.2017 లో అప్పటి ధర్మకర్తల మండలి రూ.7కోట్లతో శివం టు శివం రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ధర్మకర్తల మండలిలో ఆమోదిం చారు. అయితే 2019లో వచ్చిన వైకాపా పాలకులు ఈ పను లను మొదట రూ.17కోట్లకు పెంచారు. మళ్ళీ వారే బైపాస్ నుంచి అర్థనారీశ్వరాలయం వరకు సుమారు ఒక కిలోమీటర్ పెంచుటకు అంచనాలను రూ.33కోట్లకు పెంచారు. మళ్ళీ మార్పులు చేర్పులు చేసి రూ.44కోట్లు చేసారు. అయితే పనులకు శ్రీకారం చుట్టలేదు.

### చక చకా పనులు:

ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దేవస్థానంకు సంబంధించిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించారు.అందులో శివం టు శివం రోడ్డు ఒకటి. ఈ రోడ్డు పనుల అంచనాలను పరిశీలించిన తరువాత రూ.29కోట్లకు టెండర్లు ఖరారు చేసారు. తిరుపతికి చెందిన కాంట్రాక్టర్ అంచనా రేట్ల కన్నా 2.5శాతానికి అధికానికి టెండర్‌వేసి దక్కించుకున్నారు.అయితే అంచనాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన సుధీర్‌రెడ్డి రామసేతు వంతెన నుంచి ప్రాజెక్టు వరకు పనులను హైదరాబాదులోని ట్యాంక్ బండ్ స్థాయిలో తీర్చి దిద్దుటకు సూచించారు. అక్కడ వరకు 45 మీటర్ల వరకు నదిలోకి వెడల్పు పెంచారు. రోడ్డు 16మీటర్ల వెడల్పు ఉంటుంది. బ్యూటిఫికేషన్‌కు భాగంగా 5చోట్ల గ్యాలరీలను మూడుమీటర్ల లోపలకు ఏర్పాటు చేస్తున్నారు.చెంబేడు ప్రాజెక్టు వరకు సిమెంటు రోడ్డు. అక్కడ నుంచి అర్థనారీశ్వరాలయం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఖరారుచేసారు.మొత్తం2.7కిలోమీటర్ల నిర్మాణం జరుగుతుంది.



స్వర్ణముఖి నదిలో నిర్మాణం జరుగుతున్న శివం టు శివం రోడ్డు

### పెద్ద సర్కిల్:

శివం టు శివం రోడ్డు నిర్మాణానికి సంబంధించి పాత జయరామారావు పార్కు వద్ద పెద్ద సర్కిల్ ఏర్పాటు కానుంది. ఇక్కడ జయం లాడ్జిలో కొంత భాగాన్ని తీసుకుంటారు. అలాగే పాత కాలంలో నదిలోకి మెట్లు దారి ఉండేది. అక్కడ వరకు సర్కిల్ విస్తరిస్తుంది. ఎప్పటి కప్పుడు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కంట్రాక్టర్లతో పనులకు సంబంధించి సమీక్షిస్తున్నారు. కాంట్రాక్టర్ పనుల వివరాలను తెలియజేస్తున్నారు.అక్టోబర్ నాటికి బైపాస్ నుంచి ప్రాజెక్టు వరకు బిటి రోడ్డును పూర్తి చేయుటకు హామీ ఇచ్చారు. ఇక రోడ్డు పూర్తి చేయుటకు అగ్రిమెంట్ తేదీ నుంచి ంరెండేళ్ళలో పూర్తి చేయుటకు ఒప్పందం.అయితే మహాశివరాత్రి 2026 నాటికి పూర్తి చేసి ప్రారంభించాలన్నది ఎంఎల్‌ఏ లక్ష్యం.

### వంతెన నిర్మాణానికి అటంకం:

కాంట్రాక్టర్ పనులు చక చకా వర్షాలకు ముందే పూర్తి చేయుటకు యుద్ధ ప్రాతిపదికపై నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు వద్ద పనులను ఎలాంటి మార్పుల్లేకుండా ప్రత్యేంగా రోడ్డుకు వంతెనను నిర్మించుటకు శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రాంతం హిల్ ఏరియా కావటంతో కింద పెద్ద బండరాళ్ళు పడినట్లు సమాచారం.దాంతో కొంత ఆటంకం ఏర్పడింది. ఏదీ ఏమైనా నేటి సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నారు.

# భార్యల స్థానంలో సమావేశానికి భర్తలు

**- సమావేశం నిర్వహించకుండా వెళ్ళిపోవడానికి సిద్ధమైన ఎంపిడిఓ**
**- కోరం లేక వాయిదా వేయాలని జడ్పీటిసీ సూచన**
**- అర్ధాంతరంగా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం**

శ్రీరంగరాజపురం, మే 26 ప్రభాతవార్త:

మండల సర్వసభ్య సమావేశానికి కొంతమంది మహిళా ఎంపిటిసీలు, సర్పంచ్‌ల స్థానంలో వారి భర్తలు సమావేశానికి హాజరు కావడం, సమావేశం నిర్వహించకుండా వెళ్ళిపోవాలని ఎంపిడిఓ మోహన్‌మురళీ నిర్ణయించడం, కోరం లేకపోవడంతో వాయిదా వేయాలని జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి సూచించడంతో సమావేశంలో ఎలాంటి చర్చ జరుగకుండా అర్ధాంతరంగా ముగిసింది. శ్రీరంగరాజపురం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి సరిత సమావేశానికి గైర్హాజరు కావడంతో ఎంపిటిసీ సిద్దయ్య




అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యధావిధి మాదిరిగానే ఎప్పటిలా కొంతమంది మహిళా సర్పంచ్‌లు, ఎంపిటిసీల స్థానంలో వారి భర్తలు సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభించి కొద్ది సేపటి లోనే జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి తన వెనుక వున్న పసుపురంగు తెరను తొలగించాల్సిందిగా సూచించారు. ఈ క్రమంలో ఎంపిడిఓ అటెండర్‌ను పసుపు తెరను తొలగించాలని ఆదేశించడంతో ఆ మేరకు అటెండర్ పసుపు తెరను తొలగించాడు. అంతలోనే ఎంపిడిఓ మోహన్‌మురళీకి ఫోన్ రావడంతో సమావేశంలో సభ్యులు మినహా మిగిలిన వారు ఎవరైనా వుంటే వెళ్ళిపోవాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కొంతమంది మహిళా సర్పంచ్‌లు, ఎంపిటిసీల స్థానంలో వారి భర్తలు సమావేశంలో కూర్చొని వుండటంతో వారు సమావేశం నుండి నిష్క్రమించారు. సమావేశం నుండి మహిళా ఎంపిటిసీ, సర్పంచ్‌ల భర్తలు, సోదరులు నిష్క్రమించడంతో సమావేశం నిర్వహణకు కోరం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఎంపిడిఓ మోహన్‌మురళీ సమావేశం నిర్వహించకుండా వెళ్ళిపో వాలని నిర్ణయించుకున్న సమయంలో జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి కోరం లేకపోవడంతో సమావేశంను వాయిదా వేయాలని సూచించారు. ఈ మేరకు సమావేశంను వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఓ ప్రకటించారు. మళ్ళీ సర్వసభ్య సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంను ఎంపిడిఓ ప్రకటించలేదు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కడప జిల్లాకు పయనమైన మంత్రి నారా లోకేష్



శాంతిపురంలో అభిమాని టీదుకాణంలో టీ తాగుతున్న మంత్రి లోకేష్

శాంతిపురం, మే 26 ప్రభాతవార్త

మండలంలోని శివపురం వద్ద సొంతింటి గృహ ప్రవేశంకు హాజ రైన రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం సాయంత్రం కడప జిల్లాకు రోడ్డుమార్గంలో పయనమయ్యారు. ఉదయం నుంచి మంత్రి లోకేష్ తమ నివాసంలోనే ఉంటూ స్థానిక నేతలతో మాట్లాడారు. సాయంత్రం 4.45గంటలకు శివపురంలోని స్వగృహం నుంచి కారులో కడపకు బయలుదేరారు. మార్గమధ్యంలో శాంతిపురంలో తెదేపా అభిమాని చెంగాచారి టీ కొట్టు వద్ద కారు ఆపి అక్కడే టీ తాగి అభిమాని చెంగా చారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వి.కోట, పలమనేరు, చిత్తూరు మీదుగా కడపకు వెళ్లారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, స్థానిక నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్, జనార్ధనరెడ్డి, రమేష్, చంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం నివాసంలో మైనార్టీ నేతలచే దువా కార్యక్రమం



కుప్పం, మే 26 ప్రభాతవార్త

శాంతిపురం మండలం శివపురం వద్ద సిఎం చంద్రబాబునాయుడు స్వగృహంలో ముస్లిం మత గురువులు, మైనార్టీ నేతలచే ప్రత్యేక దువా (ప్రార్థన) కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొ న్నారు. సిఎం చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఆయన కుటుం బీకులకు, ప్రజలకు అంతా మంచి జరగాలని సిఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు అన్సర్, సర్దార్, హిదయతుల్లా, జాకీర్, షరీఫ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఐరాలలో శ్రీపాలేటమ్మ గంగ జాతర

ఐరాల, మే 26 ప్రభాతవార్త:

మండల కేంద్రం ఐరాలలో గార్గేయనదీ తీరంలో వెలసిన శ్రీపాలేటమ్మ గంగజాతర మంగళవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏట ఆలయంలో పాలేటమ్మ గంగజాతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు మంగళవారం శ్రీపాలేటమ్మ ఆలయంలో 48వ గంగ జాతర వేడుకలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకె.బాలాజి ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. వేకువజామున 3 గంటలకు అమ్మవారి శిరస్సు ప్రతిష్టించి 5 గంటలకు అమ్మవారికి తెరతీసి తొలిపూజలు నిర్వహించి భక్తులకు దర్శనంతో జాతర ప్రారంభం కానుంది. బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జనం కార్యక్రమం జరుగనుంది.

## నేడు కాణిపాకంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

కాణిపాకం, మే 26 ప్రభాతవార్త:

అంతర్జాతీయ యోగా దినోత్స వం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. జిల్లాలో ఈనెల 26 నుండి జూన్ 21 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు కాణిపాకం దేవస్థానంలో మంగళవారం ప్రీ యోగా దినోత్స వాన్ని నిర్వహించనున్నారు. ఆకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు ఆలయ మాడా వీదిలో రథం ముందు బాగంగా ఈయోగా దినోత్స వంను నిర్వహించనున్నారు.

## టైగర్ లెవన్ క్రికెట్ టోర్నమెంట్ విజేత తిరువణంపల్లె జట్టు

కాణిపాకం, మే 26 ప్రభాతవార్త:

మండలంలోని చిగరలపల్లె క్రీడీ మైదానంలో జరిగిన టైగర్ లెవన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో తిరువ ణంపల్లె జట్టు విజేతగా నిలిచింది. గత నెల రోజులుగా ఈ క్రీడా మైదానంలో జరిగిన టోర్నమెంట్‌లో జిల్లాలోని దాదాపు 20 జట్లు తలపడ్డాయి. ఈమేరకు ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తిరువణం పల్లె, ఫైపల్లె జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.ఇందులో తిరువణంపల్లె జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. అలాగే తిరువణంపల్లె జట్టుకు చెందిన గురుభూషణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలి చారు. విజేత తిరువణంపల్లె జట్టుకు బ్రదర్ ప్రకాష్ 15 వేల రూపాయలను బహుమతిగా అందించగా, ఫైపల్లె జట్టుకు రెండవ బహుమతిగా ఎనిమిది వేల రూపాయలను మహేష్ అందించారు. ఈబహుమతి ప్రధానోత్స వం కార్యక్రమంలో మహేష్ స్వేరో పాల్గొని యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఈకార్యమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మీజిల్స్(తట్టు) రూబెల్లా పట్ల అప్రమత్తంగా వుండాలి

చౌడేపల్లి, మే 26 ప్రభాతవార్త



మీజిల్స్ రూబెల్లా పట్ల అప్రమత్తంగా వుండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. మండలం లోని పంచాయతీ కేంద్రం చారాల సచివాలయంలో మీజిల్స్ రూబెల్లా టీకాల వారోత్స వంలో ఆయన పాల్గొన్నారు. జర్మన్‌తట్టు రూబెల్లా అనేది వైరస్ వల్ల చిన్నారులకు సోకుతుందన్నారు. వ్యాధి నిర్మూ లనకు టీకాలను క్రమం తప్పకుండా వేయించుకోవా లన్నారు. ప్రభుత్వం నిర్దేశిత కాలంలో టీకాలను వేయించుకొని మీజిల్స్ రూబెల్లా వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎఎన్‌ఎం ఉషా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## చౌకదుకాణం నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి : పవన్

చౌడేపల్లి, మే 26 ప్రభాతవార్త

చౌకదుకాణాల నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని తహశీల్దార్ హనుమంతు అన్నారు. స్థానిక పరిపాలనా భవనంలోని తహశీల్దార్ ఛాంబర్‌లో మండలంలోని చౌకదుకాణం డీలర్లతో సమావేశం జరిగింది. చౌకదుకాణం నుంచి నిత్యావసర సరుకులను ఎండియుల ద్వారా పంపిణీని ప్రభుత్వం రద్దు పరచి పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకొందన్నారు. కార్డుదారులకు వస్తువులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలన్నారు. తూకాల్లో మోసాలు, సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని చౌకదుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

## సకాలంలో రుణాలు చెల్లించాలి : ఎపిఎం



చౌడేపల్లి, మే 26 ప్రభాతవార్త

మహిళా సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని వెలుగు ఎపిఎం సుబ్రమణ్యం కోరారు. స్థానిక వెలుగు భవనంలో మండల సమాఖ్య సమావేశం జరిగింది. మండలంలోగల గ్రామ సమాఖ్యల నిర్వహణ, రికార్డులు, సంఘమిత్రల పనితీ రుపైచర్చించారు.వెలుగుసిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నతనం నుంచే కరాటే విద్య అవసరం

**- జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి మహేష్**



పుంగనూరు, మే 26, ప్రభాతవార్త పిల్లలు చిన్నతనం నుంచే ఆత్మరక్షణ కోసం కరాటే విద్య నేర్చుకోవాలని రాష్ట్ర జిన్ షిటరియో కరాటే అవార్డు గ్రహీత, జిల్లా కరాటే అసోసి యేషన్ అధ్యక్షుడు రెడ్డి మహేష్ అన్నారు. మంగళవారం ప్రముఖ దంత వైద్య నిపు ణులు శరన్ కుమార్ సారథ్యంలో కొత్త ఇం డ్లులో ధ్యాన కళామండపంలో జెన్ సిటోరియో కరాటే అసోసియేషన్ వారి సహ కారంతో పుంగనూరు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్య ఏదైనా ఒకటి నేర్చుకోవడం చాలా అవసరం అని ముఖ్యంగా బాలికలకు వారి తల్లిదండ్రులు కరాటే నేర్పించడంలో శ్రద్ధ చూపాలన్నారు. ఈ టెస్ట్‌లో ఎల్లో బెల్ట్, ఆరెంజ్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్ విద్యార్థులు అందుకొన్నారు. మొదటి స్థానంలో షేక్ జుహ ఫాతిమా, పార్వతి నిలిచి డిప్లమా ఇన్ కరాటే బ్లాక్ బెల్ట్ సాధించారు. కార్యక్రమ న్యాయ నిర్ణేతలుగా జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి మహేష్, టెక్నికల్ డైరెక్టర్ హేమంత్, కరాటే మాస్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయండి

సోమల, మే 26, ప్రభాతవార్త

వర్షాకాలం ప్రారంభమవుతున్నందువల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పారిశుద్ధ పనులు ముమ్మరం చేయాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. సోమల పంచాయతీలు జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన ఈవో పీఆర్డీతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా కార్మికులు చెత్త వేరువేసి పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కోరారు. డంపింగ్ యార్డ్ వద్ద ఫెన్సింగ్ పనులను ఆయన పరిశీలించారు. మంచినీటి పైపులు లీకేజీ లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అనూష, పంచాయతీ సెక్రెటరీ జయశంకర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ద్రౌపతి కళ్యాణం



శ్రీరంగరాజపురం, మే 26 ప్రభాతవార్త:

తయ్యూరు పాయకట్టు అంకనపల్లి మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ద్రౌపతి కళ్యాణ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. యర్వ వంపస్తులు ఉభయదారులుగా వ్యవహరించి ఈ కార్యక్రమంను చేపట్టారు. అంకనపల్లి కుమ్మర వంశస్థులు వంశపారంపర్యంగా పూజార్లుగా వ్యవహరించి వారి ఇంటి నుండి మేళతాళాలతో సాంప్రదాయబద్దంగా యారో ఉత్సవ మహిళలు ఆరిమేని కుండలు తీసుకెళ్ళిన ఘనం ఆకట్టుకుంది. అర్చకులు కార్తీక్ మంత్రోచ్చారణ మధ్య 18 గ్రామాలకు చెందిన ప్రజల సమక్షంలో యర్వ వంశస్తులు మునిరెడ్డి నీలమ్మ దంపతులు పీఠంపై కూర్చొని కళ్యాణ ఘట్టంను నిర్వహించారు. అనంతరం భక్తులను అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## పక్కాగా ముందస్తుగా కాలువల్లో పూడికతీత

**- మేయర్ అముద**

చిత్తూరు రూరల్, మే 26 ప్రభాతవార్త:



వర్షాకాలం నేపథ్యంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలువల్లో ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలని మేయర్ అముద సంబంధిత అధికారులను ఆదేశిం చారు. కట్టమంచిలో జరుగుతన్న కాలువల పూడికతీత పనులను సోమవారం మేయర్ అముద పరిశీ లించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నగర పరిధిలో పెద్ద, మధ్యస్థ, చిన్న కాలువలన్నింటిలో పూర్తి స్థాయిలో పూడిక తొలగించాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడా కాలువలు బ్లాక్ కాకుండా ముందస్తుగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నగర పరిధిలోని అన్ని డివిజన్లలో జరుగుతున్న పూడికతీత పనుల వివరాలు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ ఈ సందర్భంగా మేయర్ అముదకు వివరించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా అన్ని డివిజన్లలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాకాలలో యోగాఆంధ్ర అభియాన్



పాకాల, మే 26, ప్రభాతవార్త

యోగ ఆంధ్ర అభియాన్ పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాకాల మండలం నందు ఈ నెల 27.05.2025 నుండి 31.05.2025వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 07.00 గంటల నుండి 08.00 గంటల వరకు సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది మరియు మండల సిబ్బందికి మొత్తం 171 మందికి ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం పాకాల మండలంలోని 1)ప్రభుత్వ హై స్కూల్, ప్రభుత్వ, 2)జూనియర్ కాలేజీ, 3)జడ్పీ హై స్కూల్ దామల చెరువు కేంద్రాలలో నిర్వహించబడునని పాకాల మండల ఎంపీడీవో వి. అరుణ సోమవారం విడుదల చేసిన తెలియజేశారు.

## పులిచెర్లను అన్నమయ్య జిల్లాలో కలపాలని ప్రిలినరీ నోటిఫికేషన్ ఇవ్వడం సమంజసం కాదు

**మాజీ జడ్పిటిసి రామనాథం నాయుడు**



కల్లూరు, మే 26, ప్రభాతవార్త

పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లాలో కలపాలని ప్రిలినరీ నోటిఫికేషన్ ఇవ్వడం సమంజసం కాదని మాజీ జెడ్పిటిసి టిడిపి సీనియర్ నాయకులు రామనాథం నాయుడు అన్నారు. పులిచెర్ల నుంచి సోమవారం రామనాథం నాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు కార్యకర్తలు చిత్తూరుకు తరలి జిల్లా ఉన్నత అధికారులకు పులిచెర్ల మండలాన్ని యధావిధిగా ఉంచాలని వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామనాథం నాయుడు మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు పులిచెర్ల మండలాన్ని చిత్తూరు జిల్లాలోని ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన శ్రీజ..మదర్ డెయిరీ ప్రతినిధులు

కుప్పం, మే 26 ప్రభాతవార్త



కుప్పం ప్రాంతంలో త్వరలో ఏర్పాటు కానున్న శ్రీజ పాల ఉత్పత్తుల సంస్థ, మదర్ డెయిరీ సంస్థ ప్రతి నిధులు సోమ వారం ఉదయం సిఎం చంద్రబాబునాయుడు స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం చంద్ర బాబు వారితో కాసేపు చర్చలు జరిపారు. విజన్ స్వర్ణాంధ్రకు అనుగుణంగా ఈ సంస్థలు కుప్పంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం పట్ల సిఎం వారిని అభినందించారు. ఇప్పటికే ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కుప్పంలో భూములు కేటాయించడం జరిగిందన్నారు. శ్రీజ మిల్క్ ప్రాడక్ట్ సంస్థ కుప్పం ప్రాంతంలో డెయిరీ ఏర్పాటుచేయడంతో పాటు పశుదాణా ప్రాసెసింగ్ కేంద్రాన్నిసైతం ఏర్పాటుచేయనుందన్నారు. అలాగే మదర్ డెయిరీ సంస్థ పళ్ల గుజ్జు పరిశ్రమ ఏర్పాటు చేసి 8వేలమందికి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఇలాంటి సంస్థల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని సిఎం పేర్కొన్నారు. ఇప్పటికే ఈ రెండు సంస్థలు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. కాగా ఈ రెండు పరిశ్రమలను 15-18 నెలల్లోపు పూర్తి చేయాలని సిఎం సంస్థల ప్రతినిధులకు సూచించారు.

## సిఎం చిత్రపటానికి చౌకడీలర్లచే పాలాభిషేకం



శాంతిపురం, మే 26 ప్రభాతవార్త

ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారానే ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల మండలంలోని చౌక దుకాణ డీలర్లు సోమవారం మండల సచివాలయం వద్ద సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు తహశీల్దార్ శివయ్య అధ్యక్షతన చౌక డీలర్ల సమావేశం సంఘ అధ్యక్షుడు చంద్ర నేతృత్వంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాలను రద్దు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇకపైప్రజలు నేరుగా చౌక దుకాణాల్లోనే సరుకులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలి

రామకుప్పం, మే 26 ప్రభాతవార్త



ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా అందించాలని రాష్ట్ర నేతలు మునస్వామి, పట్ర నారాయణ, రామూర్తి పేర్కొన్నారు. సోమవారం ఎంపిపి ఛాంబర్‌లో డీలర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే సరుకుల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం మరలా పాత విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జూన్ 1న పండగ వాతావరణంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి వెంకట్రామగౌడు, యూనిట్ ఇన్‌చార్జ్ గంట్లప్పగౌడు, జిల్లా నేత జయశంకర్, డీలర్లు బాబు, కృష్ణప్ప, వెంకటరామిరెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి




కాణిపాకం, మే 26 ప్రభాతవార్త:

కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇఎస్.ఇంద్రేష్ సోమవారం కుటుంబసమేతంగా కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిల వుండగా చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక సోమవారం కాణిపాకం స్వామివారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు, వారికి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనానంతరం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం బోల్తా



శ్రీరంగరాజపురం, మే 26 ప్రభాతవార్త:

శ్రీరంగరాజపురం మండల పరిధిలోని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో కొత్తపల్లి గ్రామ వాణిజ్య కూడలిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నస్వామి(45) తీవ్రంగా గాయపడ్డాడు. తాను నడుపుతున్న ద్విచక్రవాహనం బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా బర్గూరు తాలుకా సిగరాలపల్లి తమ్మగౌడ్నర్ గ్రామంకు చెందిన చిన్నస్వామి నగరి దగ్గరలోని గేట్ పుత్తూరులో వున్న స్నేహితుడితో ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. అయితే ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి వద్ద బైక్ బోల్తా పడటంతో చిన్నస్వామికి తీవ్ర గాయాలు కాగా స్నేహితుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నస్వామిని స్థానికులు పిహెచ్‌సికి తీసుకెళ్ళి ప్రథమచికిత్స చేసి అనంతరం 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం అందించడానికి చిన్నస్వామిని వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ చేయాలి

సదుం, మే 26, ప్రభాతవార్త

రేషన్ షాపుల ద్వారా బియ్యం పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలని తాసిల్దార్ జయప్రకాష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌక దుకాణాల డీలర్లతో తాసిల్దార్ కార్యాలయంలో సమావేశం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను వివరించారు. జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా మాత్రమే సరుకులు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం, సరుకుల పంపిణీ చేయాలని సూచించారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి దివ్యాంగులకు రేషన్ డీలర్ ద్వారా డోర్ డెలివరి చేయాలన్నారు. ఈ పోస్ డివైసులకు కాటాలకు సంబంధించి విజన్ టెక్ సిబ్బంది తూనికలు కొలతలు శాఖ అధికారులు మరియు



పౌరసరఫరాల శాఖ అధికారులు, రేషన్ డీలర్లతో కోఆర్డినేషన్ చేసుకుని సర్వీస్ చేయాలని చెప్పారు. ప్రతి రేషన్ షాప్ డీలరుకి రిజిస్టర్ ప్రకారం రెండు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేయాలి 65 సంవత్సరాలు దాటిన కార్డుదారులతో ఒక వాట్సాప్ గ్రూపు మిగిలిన రేషన్ కార్డుదారులతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు.రేషన్ షాప్ డీలర్లు వచ్చిన స్టాక్‌ని పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయాలని స్టాక్ పాడైపోకుండా చూసుకోవాలని చెప్పారు. కోవిడ్‌కి సంబంధించి వస్తున్న వార్తల నేపథ్యంలో రేషన్ షాపు వద్ద కార్డుదారులకి మధ్య డిస్టెన్స్ పాటించాలని గుంపులు గుంపులుగా చేరడం నివారించాలని మాస్కులు తప్పనిసరిగా కార్డు హోల్డర్‌తో పాటు డీలర్లు ధరించాలని సూచించారు. ఈ సమావేశంలో డిటి కుమార్, ఆర్ఐలు విఆర్వోలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల



తిరుపతి విద్య మే 26 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల అటానమస్ హోదాలో డిగ్రీ మొదటి సంవత్సరం,రెండవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 28 వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు జరిగాయి. వీటి ఫలితాలను సోమవారం ఎస్.వి. ఆర్ట్స్ కాలేజ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ పి.వి.చలపతి పర్యవేక్షణలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున రావు, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కామేశ్వరరావు, రమేష్, ఎగ్జామినేషన్ సెల్ కి చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## డిపోను అభివృద్ధి బాటలో నడపండి : ఆర్టీసీ ఎండీ



సత్యవేడు, మే 26 ప్రభాతవార్త: సత్యవేడుకు విచ్చేసిన ఆర్టీసీ ఎండీకి డిపో మేనేజర్ ఘన స్వాగతం పలికారు. గతంలో సత్యవేడు ఆర్టీసీ డిపో కలెక్షన్‌లో సమయ పాలనలో ప్రజలకు సేవలందించడంలో నెంబర్ వన్‌గా ఉండేదని, అలాంటి డిపోకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని ఎన్ఎంయూ యూనియన్ నాయకులు ఆర్టీసీ ఎండీ తిరుమలరావును కోరారు. సోమవారం సత్యవేడు ఆర్టీసీ డిపోను సందర్శించడానికి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు విచ్చేశారు. సమాచారం తెలుసుకున్న యూనియన్ నాయకులు వెంటనే సత్యవేడుకు చేరుకుని ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు శాలువ కప్పి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ ఉద్యోగుల సమావేశంలో ఎన్ఎంయూ నాయకులు మాట్లాడుతూ సత్యవేడు ఆర్టీసీ డిపోను విజయపథంలో నడిపించాలని ఆర్టీసీ ఎండీ తిరుమలరావును కోరారు. అలాగే మదనపల్లి, చెన్నై, హైదరాబాద్ సర్వీసులు, తిరుమల, చెన్నై బస్సులను సత్యవేడు కవరపేటపై సర్వీసులు నడిపితే బాగుంటుందని, సమయపాలనతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆర్టీసీ ఎండీ మాట్లాడుతూ డిపో, గ్యారేజీలతో పాటు ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం మెరుగు వంటి మౌలిక వసతులు ఉండేలా చూడాలని స్థానిక అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆర్టీసీ గ్యారేజీలో సిమెంటు కాంక్రీట్ వేయాలని స్థానిక విలేకరులు కోరగా, అందుకు బడ్జెట్ కొరత ఉందని ఎండీ సమాధానం ఇచ్చారు. అలాగే సత్యవేడు డిపో ఎత్తేస్తారన్న వదంతులను ఎవరు నమ్మొద్దని, ఈ డిపోను ఎత్తేసే ప్రసక్తే లేదని ఎండీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకట్రావు, చెంగల్‌రెడ్డి, సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## జనసేనలోకి మంగళం మహిళలు



తిరుపతి(రవాణ), మే 26 ప్రభాతవార్త : డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు విశ్వసించి తిరుపతి రూరల్ చంద్రగిరి నియోజకవర్గం మంగళం లోని పలువురు మహిళలు జనసేన పార్టీలోకి చేరారు. సోమవారం మధ్యాహ్నం జనసేన చంద్రగిరి ఇన్‌ఛార్జి తపసి మురళిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ సమక్షంలో మంగళం లోని ప్రజాదరణ పొందిన నాయకురాలు నల్లాని నిర్మలతో పాటు వంద మంది మహిళ కార్యకర్తలతో జిడినెల్లూరు ఇన్‌ఛార్జి పొన్నా యుగంధర్ సమక్షంలో పార్టీలో చేరారు. జనసేనపార్టీ కార్యాలయంలో వందమందితో భారీగా రావడంతో వారందరికీ డాక్టర్ హరిప్రసాద్, మురళీరెడ్డి కండువాలు వేసి స్వాగతించారు. నియోజకవర్గఅభివృద్ధికి కృషి చేస్తానని డాక్టర్ హామీ ఇచ్చారు. వైసపికి షాక్ తగిలిందని, జనసేనలో అందరికీ తగిన గుర్తింపు ఉంటుందని మురళీరెడ్డి తెలిపారు

## రాజకీయాల్లో రిజర్వేషన్ కల్పించేలా చూడాలి

### తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డికి గౌడనాయకుల వినతి



తిరుపతి(రవాణ), మే 26 ప్రభాతవార్త : బిసిలను బలోపేతం చేయాలని, రాజకీయంగా ముందుకు రావడానికి రిజర్వేషన్ కల్పించడానికి మీ కృషి అవసరమని గౌడసంఘం నాయకులు తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డిని కోరారు. సోమవారం నలందనగర్ లోని ఆయన నివాసంలో గౌడసంఘం నాయకులు ఛైర్మన్ ఈశ్వరయ్యగౌడ్, తిరుపతి నగరగౌడ సంఘం అధ్యక్షుడు కేతినేని నారాయణ స్వామిగౌడ్, జిల్లా గౌడ్‌సంఘం అధ్యక్షుడు బూసినేని రాజశేఖర్‌గౌడ్, ముత్యాలరెడ్డిపల్లి చొప్పనాటి శ్రీనివాసులు, నందిం రాంబాబు లక్ష్మణ్ దివాకర్‌రెడ్డిని కలిశారు. మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఆత్మీయంగా పలకరించిన గౌడసంఘం నాయకులతో దివాకర్‌రెడ్డి కూడా తనవంతుగా మీకు సహాయ సహకారాలందిస్తానని గౌడసంఘం నాయకులుకు తెలిపారు.

## నేడు సిపిఆర్ బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్‌పై శిక్షణ



తిరుపతి(రవాణ),మే 26ప్రభాతవార్త : ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా తిరుపతి మంగళంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో (ఆర్టీవో)మంగళవారం ఉదయం సిపిఆర్, బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ ఐప శిక్షణ కార్యక్రమం ఉంటుందని తిరుపతి జిల్లా ప్రాంతీయ రవాణ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. అత్యవసర సమయంలో ప్రాణాలు నిలబెట్టే ప్రక్రియ పట్ల ప్రజలకు అవగాహన పెంచడం, ప్రాణాలను పరిరక్షించే అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలను ప్రోత్సహించడం ఈ శిక్షణా శిబిరం లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమర ఆస్పత్రి ఆర్థోఫెడిక్ విబాగాధిపతి డాక్టర్ ప్రసాద్‌గౌరినేని, ఎండి డాక్టర్ రమాదేవి గౌరినేని, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అమర ఆస్పత్రి అత్యవసర విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణారెడ్డి ఈకార్యక్రమం నిర్వహిస్తారన్నారు. వాహనదారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

## జననీ మిత్ర యాప్‌పై ఏఎన్ఎమ్ ఆశా కార్యకర్తలకు శిక్షణ



తిరుపతి హెల్త్, మే 26 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో జననీ మిత్ర యాప్‌పై ఏఎన్ఎమ్ ఆశా కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జననాల రేటు క్రమంగా తగ్గుతోంద న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీల ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి జననీ మిత్ర యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యాశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ జననీ మిత్ర యాప్ వలన మహిళ ఆరోగ్య భద్రతకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సమస్యలను ముందుగానే గుర్తించి వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డాక్టర్లు, సిబ్బంది, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగా పోటీలలో విజేతలుగా నిలవండి! : ఎంపిడిఓ

చంద్రగిరి, మే 26 ప్రభాతవార్త: గ్రామ స్థాయి యోగా పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజేతలుగా రాణించడానికి ప్రయత్నించాలని ఎంపిడిఓ శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. ప్రతి పంచాయతీలో మంగళవారం 19 ఏళ్ళ నుండి 35 ఏళ్ళ లోపు వారికి ఉదయం 7.30 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



తిరుపతి విద్య, మే 26 ప్రభాతవార్త : స్వయం ప్రతిపత్తి కలిగిన శ్రీపద్మావతి మహిళా డిగ్రీ,పీజీ కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఏప్రిల్ 28 నుండి మే 9 వరకు జరిగిన రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ సోమవారం విడుదల చేశారు. ఈ పరీక్షలలో 92 శాతం విద్యార్థినిలు ఉత్తీర్ణతను సాధించారని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎ విద్యుల్లత తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జి.భద్రమణి,డాక్టర్ సి.దివ్యవాణి,సూపరిండెంట్ శాంతి, ఎగ్జామినేషన్ మెంబెర్స్ జి.సుధాకర, చంద్రశేఖర్,సంధ్య అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి విలువైన గ్రంథాలు బహుకరణ



తిరుపతి విద్య, మే 26 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య రాణి సదాశివమూర్తి తమ వ్యక్తిగత సేకరణ నుండి అమూల్యమైన 300 పుస్తకములు శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ గ్రంథాలయమునకు బహుమతిగా అందజేసారు. వీటిలో అమూల్యమైన ఆధ్యాత్మిక గ్రంథాలు, వైదిక గ్రంథాలు,ఆగమ గ్రంథాలు, స్వతంత్ర రచనలు, అనువాదములు, వ్యాఖ్యానములు, నిఘంటువులు మొదలైనవి కలవు.ఈ గ్రంథములు వేద విశ్వవిద్యాలయ గ్రంథాలయమును మరింత పరిపుష్టం చేయగలవని ఈ సందర్భంగా వారు చెప్పారు.ఈ గ్రంథాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి. భాస్కరుడు కి అందించారు.ఈ కార్యక్రమములో విశ్వవిద్యాలయ, పరిశోధన విభాగ నిదేశకులు డా.ఎ.వేంకటరాధేశ్యామ్ పాల్గొన్నారు.

## 28న హుండీల లెక్కింపు

శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లతో పాటు పరివార దేవతల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 28న లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి సోమవారం వివరించారు. నెల రోజుల పాటు వేసవి సెలవుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు.అయితే హుండీల లెక్కింపును మందుకొట్టు మండపంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## రేణిగుంటలో తిరంగా ర్యాలీ



రేణిగుంట మే 26 ప్రభాతవార్త : పట్టణం నందు పెహల్గాం ఉగ్రదాడికి ధీటుగా జవాబిస్తూ భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా సోమవారం బిజెపి పార్టీకి చెందిన రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జి పాలెం తేజోవతి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. రేణిగుంట పట్టణ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. భారతదేశానికి జయ జయ ధ్వనాలతో పాటు జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బిఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప, రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విఆర్ రావణన్, టిడిపి సీనియర్ నాయకులు అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, కొరియర్ రవి,బిజెపి నాయకులు జి పాలెం కృష్ణారెడ్డి, కరుణాకర్ రెడ్డి, పవన్ సింగ్, శ్రీనివాస్, రాజశేఖర్, అపర్ణ, వేలు, జగన్మోహన్ రెడ్డి, మహేంద్రరెడ్డి, బాలాజీ, ఆటో ఓనర్స్ డ్రైవర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

రేణిగుంట మే 26 ప్రభాతవార్త : రేణిగుంట (తిరుపతి) సిఆర్ఎస్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయ పాస్ సెక్షన్ నందు మే నెల 8వ తేదీ విశ్రాంత ఉద్యోగి ముని కుమార్ పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పాస్ సెక్షన్ చీఫ్ ఆఫీసర్ మంజూష సోమవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మే నెల 8వ తేదీ సిఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగి ముని కుమార్ పాస్ రెన్యువల్ చేసుకోవడానికి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులోని పాస్ సెక్షన్కు వెళ్ళాడు. పని పూర్తి చేసుకొని సెల్ఫోన్ మర్చిపోయాడు. ఫోన్ అప్పగించినందుకు పాస్ సెక్షన్ ఇన్చార్జి, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి విజయకుమార్ కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## ఖురాన్ అవగాహన శిక్షణా తరగతులు



శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త : అల్లాహ్‌చే పంపబడిన దివ్యగ్రంథం ఖుర్ ఆన్ అని దానిని అధ్యయనం చేయటంతో పాటు అవగాహనకల్గి ఉండాలని షేక్ ముహమ్మద్ అన్నారు. శ్రీకాళహస్తిలోని బహాదూరుపేటలోని మస్జిద్‌ఏ మహమ్మదీయలో మూడు రోజుల ఖుర్ ఆన్ శిక్షణా కార్యక్రమాలను సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాలను జమాఅతే ఇస్లామీ హింద్, యస్ఐఓలు సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ మనిషి జీవితాన్ని సన్మార్గంలో నడిపే దిక్సూచి ఖుర్ అన్ అన్నారు. నేడు వేసవి సెలవుల సందర్భంగ ఈ మహోన్నత కార్యక్రమాలను ఏర్పాటు చేయటం ముదావహం అన్నారు. షేక్ ముహ్మద్,షేక్ ఆమీర్‌బాషా, దావూద్, ముజమ్మిల్ అహమ్మద్, నాశిర్, ఉబూదుర్ రహమాన్, అమీర్ యాహ్యాఖాన్, జహీర్,సైపుల్లా తదితరులు దివ్యఖుర్‌ఆన్ గురించి వివరించారు.

## భారీగా మోటారు,స్టార్టర్‌లు చోరీ



శ్రీకాళహస్తిరూరల్,మే 26 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామంలో భారీ ఎత్తున మోటారు,స్టార్టర్లు చోరీ జరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులందుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం అందిన సమాచారం మేరకు 50 మంది రైతులకు సంబంధించిన మోటార్లు, స్టార్టర్‌లో చోరీ జరిగాయని లబోదిబో అంటున్నారు. అడనాదడపా వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతులు వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డున వ్యవసాయం ఒరెండు సార్లు పంటలు వేయటం ఆనవాయితి. ఆదివారం రాత్రి పంట పొలాల నుంచి ఇంటికి వెళ్ళిన రైతులు సోమవారం వేకువ జామున పంట పొలాలకు నీళ్లు కట్టడానికి వెళ్ళినరైతులు నివ్వెరబోయారు. అసలే వ్యవసాయం ఎత్తుభారంగా నష్టాల ఊబిలో సాగుతున్న తరుణంలో గోరుచుట్టుపై రోకల పోటు అన్నట్లు పరిస్థితి మారిందన్నారు. మోటార్లు, స్టార్టర్లు దొంగలించబడగా ముచ్చెమటలు పట్టాయి. వరి నాట్లకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఇలా మోటార్లు,స్టార్టర్లు దొంగలించబడటంతో వ్యవసాయం ఎలా చేయాలో దిక్కుతోచటం లేదని రైతులు వాపోతున్నారు. ఒక్కసారి వాటిని ఏర్పాటు చేసుకోవాలంటే వేలకు వేలు ఖర్చుపెట్టుకోవాల్సి వస్తుందని వాపోతు న్నారు. వ్యవసాయానికే అప్పుల తిప్పలుతప్పటం లేదని మళ్ళీ ఇదో భారం అని వివరించారు.ఇక కొత్తవి కొనుగోలు చేయాలన్నా వారం రోజులు పడుతుందని అప్పటి వరకు నారుమడులు ముదిరి పోతాయని దిగుబడి తగ్గుతుందని వివరించారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ నెలలో ఇంత భారీ మొత్తంలో చోరీ జరగటం రెండో సారి అన్నారు.ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసారు.

## వైభవంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి,మే26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం,రాజగోపురం నుంచి వాహనాల మండపం వద్దకు చేర్చి అక్కడ పూజలు జరిపి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవంతో పాటు ఇన్స్పెక్టర్ హరియాదవ్ ఉన్నారు.

## గంజాయి విక్రేతల అరెస్టు!

శ్రీకాళహస్తి, మే 5 ప్రభాతవార్త: టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంజిఎం ఆస్పత్రి సమీపంలో గంజాయి అక్రమరవాణా జరుగుతుందని తెలుసుకున్న టుటౌన్ సిఐ నాగార్జున తమ సిబ్బంది హుటాహుటిన దాడులు చేశారు. ఎంజిఎం ఆస్పత్రి వద్ద అనుమానాస్పదంగా ఉన్న చెన్నైకు చెందిన ముగ్గురు యువకులను విచారింగా వారి ను ంచి17కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నేడు టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పాత్రికేయుల సమాచారం పెట్టి వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు.

## శ్రీకాళహస్తి నుంచి మహానాడుకు 100 బస్సులు



శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త : మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కడపజిల్లాలో జరగనున్న తెలుగుదేశం మహానాడు సభలకు శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి వంద బస్సులను ఏర్పాటు చేసినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఒక్కొక్క మండలం నుంచి 20 బస్సులతో పాటు మున్సిపాలిటి నుంచి 40 బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహానాడుకు తన తండ్రి హాయాం నుంచి శ్రీకాళహస్తి కార్యకర్తలకు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.పది రోజుల నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులతో సమాలోచనలు జరిపామన్నారు. అలాగే మహానాడుకు వచ్చే కార్యకర్తలు అభిమానులకు భోజన వసతులు ఇతర సదుపాయాల్ని కల్పించుటకు బాధ్యతను అప్పగించినట్లు సుదీర్‌రెడ్డి వివరించారు. సోమవారం కడపజిల్లాలో ఏర్పాట్లను పరిశీలించుటకు బయలుదేరి వెళ్ళారు. తిరుపతి జిల్లా నుంచి చంద్రగిరి శాసనసభ్యుడు నాని, తుడా ఛైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మెన్ రవినాయుడు,శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడులు ఏర్పాట్లును పరిశీలించారు.

## అంకాళమ్మ దేవస్థానం వద్ద అన్నదానం



శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త: పివిరోడ్డు నందు వెలసిన అంకాలమ్మ దేవస్థానంలో గత మూడు సంవత్సరాలుగా అమావాస్య సందర్భంగా మరాఠీ పాళెం వాస్తవ్యులు అయిన యశ్వంత్‌రావు, జయగణేష్, హరిహర కుమార్, శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈనెల సహాయ సహకారాలు అందించిన రామారెడ్డి గోపి, నరేష్‌కుమార్, వెంకటసుబ్బయ్య, రష్మిత, కుమారి, డాక్టర్‌కృపానిధి, లోకేష్‌యాదవ్, అరుణ్, దినకర్‌రెడ్డి సుబ్రాయకామత్, చక్రధర్, రాహుల్, అడపాశివ కుమార్‌రెడ్డి, క్రాంతి కుమార్, ఉపేందర్‌రెడ్డి రాఘవేంద్ర, గణేష్‌బాబు, కృష్ణప్రియ, శ్రీరాం, భరత్, సాయిప్రదీప్, వినోద్‌రావు, బాలాజీ, ఓంకార్, వరప్రసాద్, లీలామోహన్ దిలీప్, మయూర్ ప్రసన్న, రాజేశ్వరరావు, కార్తీకేయన్, చేతలిశర్మ, ఆనంద, నారాయణ్, దీపాన్ష్‌యాదవ్, పరమేశ్వరరావు, శ్రవన్‌కుమార్, ప్రదీప్‌రావు, కార్తీక్‌రావు, వినోద్‌కుమార్, సతీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మైనార్టీల అభివృద్ధి ఒక్క తెలుగుదేశంపార్టీతోనే



శ్రీకాళహస్తి, మే 26 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకిరాలీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవ్వడమే రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు, శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డిలు ఏదలకోసం సబ్సిడీ లోన్లు ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. కుల సర్టిఫికెట్ అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డు మరియు ఆధార్‌కార్డులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సిందిగా మైనార్టీ వెల్ఫేర్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారని షాకిరాలీ పేర్కొన్నారు.

## మహానాడును జయప్రదం చేయండి



శ్రీకాళహస్తి, మే 26 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు చేతులమీదుగా ప్రారంభమై తెలుగుజాతి ఐక్యతకు నిదర్శనంగా నిలచే మహానాడును జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు. డా.జి.దశరథాచారిలు సంయుక్తంగా పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రానికి దగ్గర్లో ఉన్న సువిశాల ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ వరుసగా మూడురోజుల పాటు నిర్వహించ తలపెట్టిన మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు లక్షలాదిగా తరలివచ్చిన తెలుగుజాతి ఐక్యతను ప్రపంచానికి మరోసారి తెలియజేస్తూ మహానాడును విజయవంతం చేయాలని కోరారు. వైఎస్ఆర్‌జిల్లా పేరుగా వైఎస్ఆర్ కడపజిల్లాగా పేరు మారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేయడం శుభపరిణామం అని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు. డా.జి.దశరథాచారి, మిన్నల్‌రవి, గాలిమురళీనాయుడు డా.యం.ఉమేష్‌రావు, పేటబాలాజీరెడ్డి, మునిరాజయాదవ్, యంయస్‌రెడ్డి, కిషోర్, కోటచంద్రశేఖర్, భాస్కర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కేశవరావు మృతదేహాన్ని చూసి ప్రభుత్వాలు భయపడుతున్నాయి



శ్రీకాళహస్తి, మే 26 ప్రభాతవార్త : కేశవరావు మృతదేహాన్ని చూసి ప్రభుత్వాలు భయపడుతున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు మృత దేహాలను తక్షణమే బంధువులకు అప్పగించాలని తెలిపారు. సిపిఐ మావోయిస్తు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాలకేశవరావుతో సహా ఆపార్టీ నాయకులు ఆదివాసీల్ని హత్యచేసిన మోడీ ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యలును ఖండిస్తూ అమృతదేహాలను వారి బంధువులకు వెంటనేఅప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో దళిత ఆదివాసీలను హత్యలు చేస్తూ మావోయిస్టులను అంతం చేస్తున్నామని వేడుకలు జరుపుకుంటూ బాధ్యత కలిగిన ప్రధాని మనుషులు చంపడాన్ని అభినందించడం అంటే ఇది అటవిక చర్యగా ఆయన అభివర్ణించారు. చత్తీస్‌గడ్, నారాయణపూర్ మారణకాండతో సహా అడవుల్లో సాగిస్తున్న మారణ హోమంపై సుప్రీంకోర్టు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.మావోయిస్తుల కాల్పుల విరమణ ప్రకటించిన శాంతి చర్యలుఎక్కువ కాలం మనుగడ కొనసాగించలేవని హెచ్చరించారు. వెంటనే మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని లేకుంటే భవిష్యత్తులోప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## ధనంజయయాదవ్‌ని ఎమ్మెల్యే పరామర్శ



విజయపురం, మే 26 ప్రభాతవార్త: రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికారి చుక్క ధనంజయయావ్‌ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. ధనంజయకి ఆరోగ్యం బాగలేక చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విజయపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌రాజు, బాబుయాదవ్, కలియంబాకం చెరువు నేటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్‌నాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు బాబునాయుడు కూడా పరామర్శించారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
తడ శాఖ, తిరుపతిజిల్లా

రుణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
రిడెంప్షన్ నోటీసు

టు: రుణగ్రహీత: 1) శ్రీమతి పుల్లూరు మునెమ్మ, భర్త లేట్ ఆర్ముగంరెడ్డి, వెంకటాద్రి పాళెం, రామాపురం పోస్ట్, తడ మండలం, తిరుపతి జిల్లా - 524401
2) శ్రీ పుల్లూరు సురేష్, తండ్రి పి.ఆర్ముగం, వెంకటాద్రి పాళెం, రామాపురం పోస్ట్, తడ మండలం, తిరుపతి జిల్లా - 524401
హామీదారు: శ్రీ పి.మునుస్వామి, తండ్రి చక్రవర్తి, వెంకటాద్రిపాళెం, రామాపురం పోస్ట్, తడ మండలం, తిరుపతి జిల్లా - 524401
అయ్యా/ అమ్మా !
విషయం: సర్ఫేసి చట్టం, 2002లోని సెక్షన్ 13(8) క్రింద ప్రకారం విముక్తి హక్కును అమలు చేయడం కోసం నోటీసు
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.
రుణఖాతా శ్రీమతి పుల్లూరు మునెమ్మ & శ్రీపుల్లూరు సురేష్ వారిని బకాయి రూ.5,35,930.53 (ఐదు లక్షల ముప్పై ఐదు వేల తొమ్మిది వందల ముప్పై రూపాయల యాభై మూడు పైసలు మాత్రమే) మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరాబ్యాంక్, తడ శాఖ యొక్క అధీకృత అధికారి 27.12.2022 వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది: 19.04.2023న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా / భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. మరియు చట్టం ప్రకారం సదరు స్వాధీనతా నోటీసును ఆంధ్రప్రభ (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్(ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది: 22.04.2023 న ప్రచురించడమైనది.
ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది: 27.12.2024 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తం రూ.5,35,930.53 (ఐదు లక్షల ముప్పై ఐదు వేల తొమ్మిది వందల ముప్పై రూపాయల యాభై మూడు పైసలు మాత్రమే)+ వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం కల్పించడమైనది. ఒక వేళ మీరు చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ వివరించి ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది (ఎ) ఆటువంటి సెక్యూర్డ్ ఆస్తును కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ఒప్పందం ద్వారా. దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు కలిగి ఉంటారు, ఒక వేళ విఫలమైనచో, సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకునే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోవున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంకును ఏలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైదనది.
స్థలం : తడ
తేది: : 14.05.2025
సం॥ అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
కుప్పం-2 శాఖ, కుప్పం, చిత్తూరు జిల్లా

రుణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
రిడెంప్షన్ నోటీసు

టు: రుణగ్రహీత: మెస్సర్స్ వి.ఎస్.టి.శివం ఫుడ్స్ ఇండస్ట్రీస్, సర్వేనెం.24/2, సజ్జలపల్లి గ్రామం, నూలుకుంట పోస్ట్, కుప్పం, చిత్తూరు జిల్లా -517425
భాగస్వాములు: 1) శ్రీ వి.వేలు వి.వెంకటన్ అనే వెంకటాచలం, డి.నెం.1-28, సర్వేనెం.24/2, సజ్జలపల్లి గ్రామం, నూలుకుంట పోస్ట్, కుప్పం, చిత్తూరు జిల్లా -517425
2) శ్రీమతి ఎస్.భాగ్యవతి, భర్త వి.వేలు, డి.నెం.1-28,సర్వేనెం.24/2, సజ్జలపల్లి గ్రామం, నూలుకుంట పోస్ట్, కుప్పం, చిత్తూరు జిల్లా -517425
అయ్యా/ అమ్మా !
విషయం: సర్ఫేసి చట్టం, 2002లోని సెక్షన్ 13(8) క్రింద ప్రకారం విముక్తి హక్కును అమలు చేయడం కోసం నోటీసు
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.
రుణఖాతా మెస్సర్స్ వి.ఎస్.టి. శివం ఫుడ్ ఇండస్ట్రీస్ వారిని బకాయి రూ.11,37,366.24 (పదకొండు లక్షల ముప్పై ఏడు వేల మూడు వందల అరవై అరు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరాబ్యాంక్, కుప్పం-2 శాఖ యొక్క అధీకృత అధికారి 15.07.2023 వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది: 10.10.2023 న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా / భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. మరియు చట్టం ప్రకారం సదరు స్వాధీనతా నోటీసును ఆంధ్రప్రభ (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది: 14.10.2023 న ప్రచురించడమైనది.
ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది: 15.07.2023 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తం రూ.11,37,366.24 (పదకొండు లక్షల ముప్పై ఏడు వేల మూడు వందల అరవై అరు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం కల్పించడమైనది. ఒక వేళ మీరు చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ వివరించి ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది (ఎ) ఆటువంటి సెక్యూర్డ్ ఆస్తును కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ఒప్పందం ద్వారా. దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు కలిగి ఉంటారు, ఒక వేళ విఫలమైనచో, సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకునే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోవున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంకును ఏలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైదనది.
స్థలం : కుప్పం
తేది: : 12.05.2025
సం॥ అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



బాలాయపల్లి, మే 26 ప్రభాతవార్త : స్విమ్స్ ఆధ్వర్యంలో నిడిగల్లు, అలిమిలి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించేందుకు వీలుగా 35 ఏళ్ల దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని బాలాయపల్లి వైద్యాధికారి డాక్టర్ లియోన కోరారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం బాలాయపల్లి పిహెచ్ సి పరిధిలోని నిడిగల్లు, అలిమిలి గ్రామాల్లో పింక్ బస్సుల ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, సర్పంచు లు సిహెచ్. గాయత్రి, దొరబాబు, పంచాయతీ కార్యదర్శులు డి.మో హన్ రాజు, చంద్రశేఖర్, స్థానిక నాయకులు మునివెంకటే శ్వర్లు, రఘురెడ్డి, సిహెచ్ఓ బి.నీరజ, సూపర్వైజర్ టివి.నరసింహారావు, ఏఎన్ఎంలు కె.రమాదేవి, ఎస్.సుహాసిని, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలి

కోట,మే 26 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టుతుందని ఎంపిడిఓ దిలీప్ కుమార్ చెప్పారు. ఆమేరకు ఆయన సోమవారం తన కార్యాలయాంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.యోగాంధ్ర యాప్‌లో ఉద్యోగులు అందరూ తమ పేర్లను నమోదు చేసుకునలా చొరవ తీసుకొవాలని కోరారు.మండలంలోని 16 సచివాలయాలను నాలుగు క్లస్టర్లుఆ చేసి ఒక్కోక్క సచివాలయ పరిధిలో ఉన్న సిబ్బంది యోగా ఔత్సహిఅలకు ఐదు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కోట సచివాలయం,1 చిట్టేడు హైస్కూల్ సిద్దవరం సచివాలయం నందు యోకా శిక్షాణ కార్యక్రమం ఉంటుందన్నారు.జూన్ ఒకటోతేదీ నుంచి అన్ని సచివాయాల్లో ప్రజలకు యోగా పై శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు.యోగా పట్ల ప్రజలోల చైతన్యం పెంపొందించేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాలను తహిసీల్దార్, ఎంఈఒ, ఎంపిడివో, డిప్యూటి ఎంపిడివో పర్యవేక్షిస్తారని తెలిపారు.

## గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాంప్



కోట,మే 26 ప్రభాతవార్త : మండలం కోత్తపట్నం సచివాలయంలో సోమవారం గిరిజనల కొరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడివో దిలీప్ కుమార్ చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక క్యాంప్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ఆమేరకు తీర ప్రాంతంలోని గిరిజనులుఈ అధార్ క్యాంప్‌ను చక్కగా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో మరో బైక్ చోరీ!

కోట,మే 26 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని కృష్ణకు చెందిన బైక్ చోరీకి గురైనట్లు కోట పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఆమేరకు కృష్ణ తన ఇంట్లోనుంచి సిసి కెమెరా ద్వార తన బైక్ ను తీసుకేళ్లుతున్న దృశ్యాలను ఆధారలతో సహ పోలీసులకు అంద చేశారు. ఆమేరకు గొవింద వాసును పోలీసులు ఆదపులోకి తీసుకుని విచారణ జరిపారు.విచారణలో అతనికి మతి స్దిమితం లేదని తెలడంతో అతనిని పంపిచేశారు. విచారిస్తున్నమని ఎస్.ఐ వపన్ కుమార్ చెప్పారు. ఆ మేరకు తను వాకాదు సిఐ కూడా పిర్యాదు చేయడం జరిగిందన్నారు.మండలంలోని వరుసగా బైక్‌లు చోరీకి గురికావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## కారు బోల్తా పలువురికి గాయాలు



పెళ్లకూరు మే 26 ప్రభాతవార్త: మండలంలోని పెన్నేపల్లి వద్ద 71 వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున తమిళనాడులోని రాయవేలూరు నుండి నెల్లూరుకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తండ్రి రమణయ్య (62)తల్లి పోలమ్మ (55)కు తీవ్ర గాయాలు కాగా కుమారుడు చంద్రశేఖర్ (35)కు స్వల్ప గాయాల య్యాయి ఈ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను నాయుడుపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని విజయ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగం కారణమని స్థానికులు చెబుతున్నారు ఈ ప్రమాదంపై పెళ్లకూరు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## రైతులకు నోటీసులు జారీ



బాలాయపల్లి, మే 26 ప్రభాతవార్త : మండలంలోని కాట్రగుంట గ్రామ స్మశానానికి వెళ్లే దారిని కొంతమంది రైతులు ఆక్రమించుకొని ఉన్నారని వారికి నోటీసులు జారీ చేసినట్లు తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. కొంతమంది గ్రామస్తులు స్మశాన స్థలం ఆక్రమించారని ఫిర్యాదు చేయడంతో సిబ్బందిని పంపి విచారణ జరిపించినట్లు తెలిపారు. ఆక్రమణదారులకు నోటీసులను సోమవారం జారీ చేసినట్లు వివరించారు. దారి స్థలంలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. స్మశాన స్థలం ఆక్రమించడం వల్ల ఎవరైనా చనిపోతే తీసుకెళ్లేది కష్టంగా ఉందని గ్రామస్తులు వాపోయారు.

## కాకాణి అరెస్ట్ కూటమి కుట్ర : ఎంపి గురుమూర్తి



వెంకటగిరి, మే 26 ప్రభాతవార్త : మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు పూర్తిగా అక్రమ మని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఖండించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం కుట్రలకు తెరలేపిందన్నారు. ఆ క్రమంలోనే కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేశారని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, తమ రాజకీయ ప్రయోజనాల కోసం "రెడ్ బుక్" రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. మాకు, మా పార్టీకి న్యాయవ్యవస్థపై గౌరవం ఉందని అన్నారు. న్యాయస్థానాలలోనే ఈ కుట్రలపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించిన ఆర్‌డబ్ల్యూఎస



వాకాడు, మే 26 ప్రభాతవార్త: వల్లమేడు గ్రామ వైసిపి నాయకుల, ప్రజలు గత 20 రోజులుగా నీటి ఎద్దడి నెలకొందని సోమవారం ఎంపీడీవో శ్రీనివాసులకు విన్నవించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి వెళ్లి తాగునీటి సమస్యను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు, పంచాయతీ గ్రామ సర్పంచ్ మల్లాపు నాగరాజు సహకారంతో పైపులైన్లకు పలుచోట్ల పగుళ్లు మరమ్మతులను చేపట్టారు. అదేవిధంగా చిన్నతోట ఏరియాలో కొత్తగా వేస్తున్న ఫిల్టర్ పాయింట్లు పర్యవేక్షించి, మరో చోట కొత్తగా వేసిన బోరు పాయింటులు ద్వారా తాగునీరు సరఫరా అయ్యే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చర్యలు తీసుకున్నారు. నిడిగుర్తి పంచాయతీ ప్రజలకు తాగునీటి సమస్య తీరిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి తెలిపారు.

## తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదు

**- మాజీ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్**



వెంకటగిరి, మే 26 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ వారు పెడుతున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి పోల్ప్యోయిన అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ చేసి వెంకటగిరి కోర్టులో హాజరు పరిచిన సందర్భంగా ఆయనను కలిసేందుకు వెంకటగిరి వచ్చారు. మాజీ మంత్రి కాకాణిపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేశారని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిపై పెడుతున్న కేసులు పై న్యాయబద్ధంగా పోరాటం చేస్తామని తెలిపారు.

# గూడూరు డివిజన్

## ధోవల్ సేవలు అభినందనీయం



గూడూరు, మే 26 ప్రభాతవార్త : భారత దేశం ఆర్మీ, జవాన్లకు అండగా ఉన్న ఇంటలిజెన్స్ ఆఫీసర్ అజిత్ ధోవల్ సేవలు అభినందనీయం అని వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారతదేశంలో లారెన్స్ బిష్ణోయ్‌ను జైలు నుండి విడుదల చేసిన తరువాత పహల్గామ్‌లో జరిగిన దుర్ఘటన తరువాత పాకిస్థాన్ ఉగ్రవాదులను నాదేశం మీదకు వస్తే వూరుకోను అని స్టేట్ మెంట్ ఇచ్చావు. మన దేశానికి ఎవరు హాని కలిగిస్తారో వాళ్లు మన శత్రువులే ఇప్పటి వరకు నువ్వు అనుకుని చేసింది తప్పు నువ్వు అనుకున్న మాట నిలబెట్టుకుని ఇప్పుడు నువ్వు ఉగ్రవాదులను నాదేశం మీదకు వచ్చారు. మన దేశంలో ఇంటలిజెన్స్ ఆఫీసర్ అజిత్ ధోవల్ ఆర్మీ, జవాన్ల గురించి ఒక వెబ్సైట్ ఓపెన్ చేయించి ఆర్మీ,జవాన్ల అవసరాలకు ఏమి కావాలో అజిత్ ధోవల్‌కి బాగా తెలుసు అని అన్నారు.

## రేషన్ దుకాణాలలో సరుకులు పంపిణీ చేయండి : ఎమ్మెల్యే



గూడూరు, మే 26 ప్రభాతవార్త: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సూచించారు. జూన్ ఒకటో తేదీ నుండి డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో ఎమ్మెల్యే డీలర్లతో సమావేశం నిర్వహించారు. గూడూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను డీలర్లు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా హయాంలో వాహనాల ద్వారా అందరికీ బియ్యం పంపిణీ చేయలేక పోయారని, రోడ్లల్లో గుంపులు గుంపులుగా బండ్ల వద్ద ప్రజలు అవస్థలు పడుతూ బియ్యం తీసుకునే వారన్నారు. కూటమి ప్రభుత్వంలో మళ్ళీ డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.

## మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పిలుపు**



గూడూరు, మే 26 ప్రభాతవార్త : కడపలో తలపెట్టిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. సోమవారం గూడూరు పట్టణంలోని గమళ్ళపాళెంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహానాడు విజయవంతంపై పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. మూడు రోజుల పాటు కడపలో జరిగే మహానాడును విజయవంతం చేయాలని జన సమీకరణ చేయాలని ఆయన నాయకులకు సూచించారు. నియోజకవర్గం నుండి ఐదు వేల మందికి మహానాడుకు వచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, భాస్కర్‌రెడ్డి, కిషోర్ నాయుడు, వాటంబేటి శివకుమార్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## పేటలో యోగా శిక్షణా తరగతులు

నాయుడుపేట, మే 26 ప్రభాతవార్త : మున్సిపాల్టీ పరిధిలో ఐదురోజుల పాటు యోగా శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని సోమవారం మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా సోమవారం తెలియజేశారు. ఈసందర్భంగా కమిషనర్ పజులుల్లా మాట్లడుతూ తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మెరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మే 27నుండి 31 వరకు ఐదురోజుల పాటు యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈశిక్షణ తరగతులు ఉదయం 7గంటల నుండి 8వరకు క్లష్టర్లలో మాస్టర్ ట్రైనర్లు యోగశిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఆశక్తి కలిగిన సచివాలయం, మెప్మా, మున్సిపాల్టి సిబ్బంది అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే యోగా శిక్షణ తరగతులకు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

## శ్రీవారి సేవలో డాక్టర్ దగ్గుమాటి



తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబంతో కలసి మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సిఎం చంద్రబాబు దంపతులకు సాదర వీడ్కోలు



కుప్పం,మే 26 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివపురం వద్ద సొంతింటి గృహ ప్రవేశంకు వచ్చి సోమవారం తిరుగు ప్రయాణమైన సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి లకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సాదర వీడ్కోలు పలికారు. ఉదయం 11.20గంటలకు సొంతింటి నుంచి ద్రవిడ వర్సిటీలోని హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు పయనమయ్యారు. సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు తదితరులు ముఖ్యమంత్రి దంపతులకు సాదర వీడ్కోలు పలికారు.

## ప్రజలను కలిసిన మంత్రి నారా లోకేష్



శాంతిపురం, మే 26 ప్రభాతవార్త : ప్రజాదరా బ్ర్ కార్యక్రమంతో సామాన్యులకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ఐటి, విద్యశాఖ మంత్రి నారా లోకేష్ మండలంలోని శివపురం వద్ద తమ స్వగృహంలో ప్రజలను కలిశారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వారి నుంచి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఆయా వినతిపత్రాలు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలతో ఫోటోలు దిగి వారిలో ఉత్సాహం నింపారు.

## పుత్రోత్సాహం కన్నా.... గురోత్సాహం మిన్న

**- గురువు దేశ రక్షణలో శిష్యురాలు జిల్లా సంయుక్త పాలనాధికారి**



వెదురుకుప్పం, మే 26 ప్రభాతవార్త : పుత్రుడు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడితే తండ్రి పొందే ఆనందం కన్నా ... శిష్యులు ఉన్నత స్థానంలో స్థిరపడితే తెలిసిన గురువు ఏలాంటి స్వార్ధం లేకుండా పొందే ఆనందం విలువ కట్టలేదని ఓ సంఘటన రుజువు చేసింది. గురువు నరసింహా ప్రభాతవార్తలో ముచ్చటించారు. చిత్తూరు జిల్లా సంయుక్త పాలనాధికారి (జాయింట్ కలెక్టర్‌గా) విధులు నిర్వహిస్తున్న విద్యాధరి అన్నమయ్య జిల్లా నందలూరు. ఆమె ఇడిపులపాయ ట్రిపుల్‌ఐటీ కళాశాలలో 2008లో అక్కడ మొదటి బ్యాచ్‌లో చదువుకున్నారు. ఆ సమయంలో వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన చిన్నస్వామి బోయుడుఅంకెమ్మల కుమారుడు బత్తల నరసింహ కెమిస్ట్రీ అధ్యాపకులుగా పనిచేసేవారు. ఐతే ఒప్పంద పద్ధతిలో పనిచేస్తూన్న నరసింహాకు డిఫెన్స్‌లో శాస్త్ర సాంకేతిక అధికారిగా ప్రభుత్వ ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లో స్థిపడిన్నట్లు చెప్పారు. కాగా ఐఎఎస్(ఇండియన్ అడ్మిన్‌స్ట్రేటివ్ సర్వీసు)కు ఎంపికై తన సొంత జిల్లా చిత్తూరులో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తుందని తెలిసి అంతులేని ఆనందంతో గురువు నరసింహ ఆమెను నేరుగా కలిసి అభినందించాలని హైదరాబాదు నుంచి వచ్చినట్లు చెప్పారు. కార్యాలయంలో కలిసి మాట్లాడినట్లు తెలిపారు. శిష్యురాలు గొప్పస్థాయి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడటం తనకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు. పట్టుదల, కృషి ఉన్నత స్థాయిలలో నిలబెట్టుతుందన్నారు. ఆమె ప్రజా సమస్యల పరిష్కారంలో చూపుతున్న శ్రద్ధాశక్తులు మంచి పేరు తీసుకురావలన్నారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించారు.

## సర్వదర్శనానికి 25గంటలుపైగానే



తిరుమల,మే 26 ప్రభాతవార్తప్రతినిధి: వేసవిసెలవులు ముగింపుకు చేరుకొంటుండటం, వారాంతం భక్తుల రద్దీ తిరుమలలో కొనసాగుతోంది. సోమవారం కూడా ఆలయం వెలుపల క్యూలైన్లు చేరాయి. ఆదివారం రాత్రివరకు 91వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించగా, సాయంత్రం వరకు 51వేలమంది దర్శనం చేసుకున్నారు. అందరి భక్తులకు సంతృప్తి కరంగా ఆలయంలోపల దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ వివిఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్ సహకారంతో ప్రశాంతంగా దర్శనం చేయించారు. స్వామివారి దర్శనం కోసం టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటల పైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

## బంగారు భక్తుడు

**-5కిలోల బంగారు ఆభరణాలతో దర్శనం**



తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి: ఐదుకిలోల బంగారు ఆభరణాలు ధరించి బంగారుభక్తుడు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. హైదరాబాద్ భక్తుడు మెడలో, చేతులకు ధరించిన అతనితో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఉత్సాహం చూపారు.

## అంత్యోదయ కార్డు ద్వారా అందుతున్న బియ్యం

**- 25 రూపాయలు చొప్పున హోటల్స్‌కి అమ్మేస్తున్న లబ్దిదారులు..**

పాకాల, మే 26, ప్రభాతవార్త : మండలంలో ప్రస్తుతం 979 అంత్యోదయ రేషన్ కార్డు లబ్దిదారులు ఉన్నారు. ఆనాటి భారత ప్రధాని అటల్ బిహారి వాజపేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల ఆకలి తీర్చి దేశ ఆహార భద్రతలో భాగంగా 35 కేజీల బియ్యం పథకం దీని ప్రధాన ఉద్దేశం. నిరుపేదలకు ఆహార భద్రతలో భాగంగా తీసుకొని వచ్చిన అంత్యోదయ అన్న యోజనలో భాగంగా తీసుకొని వచ్చిన అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డు. ఈ కార్డు ద్వారా దేశం లోని పేద ప్రజలు మూడు పూటలా కడుపు నిండా తిండి తిన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ వారు నాణ్యమైన బియ్యాన్ని ఒక్కో కేజీకి దాదాపు 45 రూపాయలు వెచ్చించి కొని మరీ రాష్ట్రంలోని లబ్దిదారులకు ఉచితంగా అందిస్తున్నది. పాకాల మండలం పరిధిలో 979 అంత్యోదయ రేషన్ కార్డు లబ్దిదారులలో ప్రస్తుతం ఒకరు ఇద్దరు సభ్యులే ఉన్నారు. మనుషులు తక్కువ వారికి పథకం ద్వారా అందే బియ్యం ఎక్కువ కావటంతో ఈ పథకం ముఖ్య ఉద్దేశం పక్కదారి పట్టి ఎక్కడి కక్కడ కిరాణా షాపులో మరియు హోటల్లో చవకగా కేజీ 25 రూపాయల ధరకే బియ్యాన్ని అమ్మేసుకునే దుస్థితి ప్రస్తుతం మండలంలో నెలకొన్నది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ వారు దీనిపై వెంటనే దృష్టి సారించి అనర్హులైన అంత్యోదయ లబ్ధిదారులను గుర్తించి వారిని ఈ యొక్క స్కీమ్ నుంచి తొలగించి వారికి మామూలు రేషన్ కార్డు ద్వారా పౌర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి అని సమాన్య ప్రజలు అంటున్నారు. ప్రస్తుత అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలను గుర్తించి ఈ కార్డు ద్వారా 35 కేజీల బియ్యం వీరికి అందించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీకాకుళం సైకిల్ యాత్రికులకు ఘన సన్మానం



పుంగనూరు, మే 26 ప్రభాతవార్త : శ్రీకాకుళం నుంచి కుప్పం సైకిల్ యాత్రకు వెళుతూ అవమానించబడిన కార్యకర్తలను సోమవారం అదే స్థలంలో ఘనంగా సత్కరించారు. గత ప్రభుత్వం చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడంతో శ్రీకాకుళం నుంచి నలుగురు కార్యకర్తలు సైకిల్ పై కుప్పం వరకు పర్యటన ప్రారంభించారు. మార్గమధ్యంలో పుంగనూరు సుగాలిమిట్ట వద్దకు రాగానే వైకాపా కు చెందిన చెంగలాపురం సూరి అనే వ్యక్తి దేశం కార్యకర్తల దుస్తులు ఊడదీయుంచి అవమానపరిచాడు. ఈ విషయం అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. పుంగనూరు నియోజకవర్గ దేశం ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇదే కార్యకర్తలను మహానాడుకు సైకిల్ యాత్రకు ఆహ్వానించారు. గతంలో వీరు అవమానించబడినచోట సోమవారం ఉదయం వారిని ఘనంగా సన్మానించి వారి సైకిళ్లకు సైకిళ్లపైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటోకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది శ్రీకాకుళం కార్యకర్తలకు జయధ్వానాలు పలికారు. దేశం నాయకులు సివిరెడ్డి, మాధవరెడ్డి, గిరి రామకృష్ణరాజు, వెంకట ముని ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ భూదానం కోసం ఒక లక్షా ఐదువేల రూపాయలను విరాళాలు అందించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోపినాథ్ కుటుంబ సభ్యులు -ప్రభాతవార్త, కుప్పం

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి : మోహిత్‌రెడ్డి



తిరుపతి రూరల్, మే 26 ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయితీ పార్టీ అధ్యక్షులు పనిచేయాలని చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం పరిధి లోని పంచాయితీలకు పార్టీ అధ్యక్షులుగా కొత్తగా నియమితులైన వారితో సోమవారం తుమ్మలగుంటలో సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న సమావేశానికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇకపై గ్రామ పంచాయితీ అధ్యక్షులకు పార్టీ కార్యక్రమాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగించేలా చూస్తామన్నారు. ప్రతి పంచాయితీలో పార్టీ కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర పార్టీ నాయకులు ఉపేంద్రరెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

## యోగా అవగాహన సదస్సు



పుత్తూరు రూరల్, మే 26 ప్రభాతవార్త: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా విద్యపై అవగాహన సదస్సు జరిగింది. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపు కుంటారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రపంచ రికార్డును నెలకొలిపే దిశలో యోగా కార్యక్రమాలను జరపడానికి నిశ్చయించారు. ఈ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సందర్భంలో సోమవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యోగా అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ భారతీయ ప్రాచీన సాంప్రదాయాల్లో యోగా ఒకటి అని యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగు పడతాయని అన్నారు. కార్యక్రమంలో టి.నరసింహులు, టి.రఘురామన్, టి.కిషోర్ బాబు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్పార్టన్ జట్టుపై పాయ్ వైస్రాయ్ జట్టు విజయం

తిరుపతి క్రీడ, మే 26 ప్రభాతవార్త : చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్1)లో స్పార్టన్ జట్టుపై పాయ్ వైస్రాయ్ జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 175/9 పరుగులు చేయగా బ్యాటింగ్‌లో ధరణి కుమార్ 69(46) సూర్య 26(13) పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో ప్రవీణ్ రోహిత్ 3, ప్రవీణ్ వాట్సన్ అండ్ రెండు వికెట్లు తీసుకున్నారు. 176 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన స్పార్టన్ జట్టు 19 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌట్ అయింది.బ్యాటింగ్‌లో మోనిష్ మాత్రమే 62(46) పరుగులు చేశారు. బౌలింగ్‌లో గిరీష్ రెడ్డి విజృంభించి 4 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీయగా, నవాజ్ రెండు వికెట్లతో రాణించారు. దీంతో పాయ్ వైస్రాయ్ జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌లో 16 పరుగులు, బౌలింగ్ లో 4 వికెట్లు తీసిన గిరీష్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నారు. గిరీష్ ఒడ్డికి డాక్టర్ జయప్రసాద్, ఈసీ మెంబర్ శివప్రసాద్ తదితరులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు.

**- ఉత్కంఠ పోరులో హైపీరియన్ జట్టు విజయం**

మధ్యాహ్నం రాయల్ చాలెంజ్ వర్సెస్ హైపీరియన్ మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో హైపీరియన్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్ మధ్యలో వర్షం కారణంగా డక్వర్ లూయిస్ ప్రకారం మ్యాచ్ ను 16 ఓవర్లకు కుదించారు. నిర్ణీత 16 ఓవర్లలో రాయల్ ఛాలెంజ్ తిరుచానూరు జట్టు 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. అనంతరం 162 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైపీరియన్ జట్టు 38 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో పృధ్విరాజ్ 89(45), హర్షారెడ్డి 53(29)విజృంభించి ఆడి ఆఫ్ సెంచరీలతో కదం తొక్కారు. దీంతో ఉత్కంఠంగా జరిగిన ఈ మ్యాచ్ లో హైపీరియన్ జట్టు 14.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి విజయం సాధించింది. కష్ట సమయంలో 89 పరుగులతో రాణించిన పృధ్విరాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. మెడిగో డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, రంజి ప్లేయర్ ఎలైజర్,కోచ్ అనిత పృధ్విరాజ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేశారు.


**తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి**

నెం.01/డి.ఎమ్/2025-2026, తేది : 26-05-2025

**టెండరు నోటీసు**

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి పరిధిలోగల తుడ టవర్స్ నందు లిఫ్ట్ మరియు ఎస్కలేటర్, ఎలక్ట్రో మేకానికల్ పార్కింగ్ మరియు సి.సి కెమెరాల పనులకి అవసరమైన రేట్లు కొరకు ఉపాధ్యక్షులు వారు సీల్డు కొటేషన్స్ కోరుచున్నారు. దరఖాస్తుదారులు టెండరు ప్రకటన యొక్క పూర్తి వివరములకు సాంకేతిక విభాగము తుడ, తిరుపతి వారిని సంప్రదించ వలయును. మరియు తుడ వెబ్ సైట్ www.tudaap.in లో చూడగలరు.

-ఉపాధ్యక్షులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి